తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



# రేపు ఎపిపిఎస్‌సి పరీక్షలు


- 390 విద్యార్థులకు ఒక పరీక్షా కేంద్రం
- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్



చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: జిల్లాలో సోమ, మంగళవారాల్లో జరుగనున్న ఎపిపిఎస్‌సి పరీక్షలను పక్కాగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎపిపిఎస్‌పి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డిఆర్‌ఓ రాజశేఖర్ శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన అనంతరం 2వసారి ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహించడం జరుగుతున్నదని, ఎలాంటి పొరబాట్లు జరుగకుండా పక్కా నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత ప్రాధాన్యత కల్గిన ఉద్యోగాలకు ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహిస్తుండటంతో చిన్న పొరబాటు లేకుండా పరీక్షలను పక్కాగా నిర్వర్తించాలన్నారు. చిత్తూరు నగరంలో శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(సీతమ్స్) పరీక్షా కేంద్రంలో 390 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు 130మంది విద్యార్థులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పేపర్-1కు హాజరు కానున్నారన్నారు. అలాగే మంగళవారం ఉదయం 9.30గంటల నుండి 12గంటల వరకు 130మంది విద్యార్థులు సివిల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పేపర్-2 పరీక్షకు హాజరు కానున్నారన్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లలో 130 మంది అభ్యర్థులు సివిల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పేపర్-3 పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షలకు సకాలంలో హాజరు అయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అసైన్మెంట్ కమిటీ పెద్దలకా...పేదలకా!

**-చెప్పింది చెయ్...నేతలు హుకుం -అసైన్మెంట్ భూములు వైసిపీ నేతలకే.. -రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు...చేయకుంటే బదిలీలు -ఓజిలి మండలంలో అసైన్మెంట్ కమిటీలలో గందరగోళం**



ఓజిలి, ఆగస్టు 19 ప్రభాతవార్త : భూమిలేని నిరుపేదలను గుర్తించి వారి జీవన ఉపాధికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని కేంద్ర ప్రభుత్వం 1977వ సంవత్సరంలో ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రవేశ పెట్టి భూస్వాములు వద్ద వున్న భూములను నిరుపేదలకు పంచేందుకు అసైన్మెంట్ కమిటీల ద్వారా నిరుపేదలకు భూ పంపిణీ కార్య క్రమం జరుగుతుంది. అసైన్మెంట్ కమిటి చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్సీ, ఆర్డిఓ, తహశీల్దార్ సభ్యులుగా ఉంటారు. మండల పరిధిలో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి అసైన్మెంట్ కమిటీలలో పేర్లను నమోదు చేసి జాబితాను తయారు చేస్తారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అసైన్మెంట్ కమిటీ ఓజిలి మండలంలో ఈ కమిటీ వ్యవహారం విరుద్ధంగా ఏక పక్షంగా జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. భూమిలేని నిరుపేదలు వేల సంఖ్యలో ఉన్న బడా వైసిపి నేతలు కనుసన్నల్లో వందలాది ఎకరాలు బినామీ పేర్లతో అసైన్మెంట్ కమిటీలో నమోదు చేయించారని ఆరోపణలు ఉన్నాయి. స్థాయిక వైసిపి నేతలకనుసనల్లోనే రెవిన్యూ అధికారులు పేదలను వదిలేసి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న నేతలకు ఎర్రతివాచి పరిచారని మండల ప్రజలు అంటున్నారు. లక్షలాది రూపాయిలు కొంత మందికి రెవెన్యూ అధికారులకు ముట్టజెప్పి ఏకపక్షంగా ఈ తంతు జరిపిస్తున్నారని మండల ప్రజలు అంటు న్నారు. ఓజిలి మండలంలో భూమి లేని నిరుపేదలు ఎంతో మంది ఉన్న ఓజిలి మండలం రెవెన్యూ అధికారులకు కనిపించడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగనన్న భూ సర్వే ఖాళీ భూములు ఎక్కడున్నాయో అధికారుల ద్వారా జాబితాను తెప్పించుకుని ప్రజా ప్రతినిధులు ద్వారా పైరవీలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బడ వైసిపీ నేతలు చెప్పిన వారికే రెవెన్యూ అధికారులు పనులు చేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తు న్నారు. వైసిపి నేతలు సూచించిన పేర్లు కమిటీలో పెట్టకుంటే బదిలీ వేటు తప్పదని చేతకాక పోతే సెలవుపై వెళ్లిపోండి అంటూ హుకుం చేస్తున్నాట్లు బహిరంగం గానే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మీ స్థానంలో మాకు అనుకూలమైన తహశీల్దార్లను, రెవెన్యూ సిబ్బందిని వేసుకుంటామంటూ అంటున్నారని అంటున్నారు. గతంలో పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ముఖ్య మంత్రులు నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు పేదలకు ప్రతి కుటుంబానికి రెండు నుంచి ఐదు ఎకరాలు భూ పంపిణీ కార్యక్రమం జరిగింది. పేదలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టినప్పటికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయాలకు ఓజిలి మండలం అధికారులు తూట్లు పొడిచారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధి కారులు, దృష్టి పెట్టి భూమిలేని నిరుపేదలను గుర్తించి అవినీతికి తావు లేకుండా అసైన్మెంట్ కమిటీలో నిరుపేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పంచాయతీ పోలింగ్ పక్కాగా నిర్వహించాం

**- ఎస్పీ రిశాంత్‌రెడ్డి పర్యవేక్షణ -జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీలు తనిఖీలు**



చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: జిల్లాలో పంచాయతీ వార్డు ఉప ఎన్నికల పోలింగ్ పక్కాగా నిర్వహిం చి పూర్తి చేశారు. జిల్లాలో శనివారం పంచాయతీ వార్డుల పోలింగ్‌ను ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించగా ఆపై ఓట్ల లెక్కింపు చేపట్టి ఎన్నికల ఫలితాలను విడుదల చేశారు. యాదమరి మండలం కాశిరాళ్ళ పంచాయతీలో జరిగిన వార్డు ఉప ఎన్నికల పోలింగ్ పోలీస్ బందోబస్తును ఎస్పీ రిశాంత్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత నిర్వహణకు ప్రజానీకం సహకరించాలని కోరారు. ఓటర్లు గుర్తింపు కార్డులతో పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని పోలీసులను ఆదేశిం చారు. అలాగే జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపిడిఓ శివరాజ్‌లు పోలింగ్‌ను పర్య వేక్షించారు. అలాగే జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఎంపిడిఓ శివరాజ్‌కు పలు సూచనలు జారీ చేసి పక్కా పోలింగ్ జరిగేలా చేయాలని ఆదేశించారు. అలాగే జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి కాణిపాకం పంచాయతీలో జరిగిన పంచాయతీ వార్డు ఎన్నికల పోలింగ్‌ను పరిశీలించారు. ఇక్కడ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వైకాపా మద్దతుదారుల తరపున పోలింగ్ తీరును పరిశీలిస్తూ నాయకులు, కార్యకర్తలకు సూచనలు జారీ చేశారు. జిడినెల్లూరు, వి.కోట, గుడుపల్లి, శాంతిపురం మండలాల్లోని వార్డు స్థానాలకు జరిగిన ఎన్నికల పోలింగ్‌ను డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐ స్థాయి అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు.

# షార్ నుంచి అగ్ని బాణ్ మినీ రాకెట్... ప్రయోగానికి సన్నాహాలు

**- ప్రైవేటు వారి రెండో ప్రయోగం ఇది**
**- వీరి కోసం ప్రత్యేక లాంచ్ ప్యాడ్**



అగ్నికుల్ తొలి ప్రయోగం అగ్ని బాణ్‌ను తరలిస్తున్న దృశ్యం

శ్రీహరికోట (తడ), ఆగస్టు 19 ప్రభాతవార్త భారత అంతరిక్ష పరిశోధన సంస్థ రాకెట్ల తయారీ, ప్రయోగా లకు ఇప్పటికే ప్రైవేటు వారికి అవకాశాలు ఇస్తోంది. గతంలో తెలంగాణకు చెందిన స్కైరూట్ వారు తమ తొలి ప్రయోగాన్ని శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. అప్పట్లోనే తమిళనాడుకు చెందిన అగ్నికుల్ స్టార్టప్‌కు మరో అవకాశం ఇచ్చారు. అయితే ఎందువల్లనో ఆ ప్రయోగం ఆలస్యమైంది. షార్ తీరంలో అగ్నికుల్ కాస్మస్ సంస్థకు లాంచ్ ప్యాడ్ నిర్మించుకునేందుకు ఇస్రోపెద్దలు స్థలం కూడా కేటాయించి ఉన్నారు. కొన్నిరోజుల క్రితం ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ లాంచ్ ప్యాడ్‌ను ప్రారంభిం చారు. ప్రస్తుతానికి అక్కడి నుంచి అగ్నికుల్ కాస్మోస్ వారు తమ తొలి ప్రయోగానికి రంగం సిద్ధం చేస్తున్నారు. అగ్నిబాణ్ పేరిట ఈ సబ్ ఆర్బిటల్ టెక్నాలజీ డెమానుస్ట్రేటర్ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 15న నూతన స్టార్టప్ సంస్థ కొన్ని పరిశీలనలు చేపట్టింది. ఈ స్మాల్ శాటిలైట్‌ను అతి త్వరలోనే భూమికి తక్కువ దూరపు కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఇందులో ఎటువంటి ఉపగ్రహాలు ప్రయోగించడం లేదు. ఇస్రో వాణిజ్య విభాగం ఇన్‌స్పేస్ సంస్థ ఆహ్వానం మేరకు ఇస్రో సహకారంతో ఈ ప్రయోగాన్ని చేపడుతున్నామని, తాము ఇంతదూరం రావడానికి వారే కారణమని అగ్నికుల్ కాస్మోస్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సింగిల్ స్టేజ్ రాకెట్ సెమీ క్రయో దశతో నింగికి ఎగురుతుంది. త్రీడీ ప్రింటెడ్ సింగిల్ పీస్ 6కెఎన్ సెమీ క్రయో దశ సాయంతో అగ్నిబాణ్ రాకెట్ భూమి నుంచి నిట్టనిలువుగా నింగి వైపు దూసుకెళుతుంది. గతంలో సింగిల్ స్టేజ్ రాకెట్లు భూమి నుంచి ఏటవాలుగా ప్రయోగించే వారు. శ్రీహరికోట శాస్త్రవేత్తలకు ఈ రాకెట్ ప్రయోగం మరో కొత్త అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే గతంలో ప్రయోగించిన స్కైరూట్ ప్రైవేటు రాకెట్ మన రాకెట్ ప్రయోగ వేదికల నుంచి ప్రయోగించారు. ఇది కేవలం ప్రైవేటు సంస్థ వారు సొంతంగా నిర్మించుకున్న రాకెట్ ప్రయోగ వేదిక నుంచి ప్రయోగిస్తున్నారు. అయితే దాని ప్రయాణం, పరిశోధన వంటివి షార్ శాస్త్రవేత్తల సహకారంతోనే జరగనున్నట్లు తెలిసింది. ఈ ప్రయోగం తేదీపై ఇంకా స్పష్టత లేదని షార్ వర్గాలు వెల్లడించాయి.

# స్వాతంత్ర్య సమరయోధుల... ఆకాంక్షల సాధనకు కృషి

**పర్యాటక శాఖ మంత్రి రోజా**



మెప్మా అర్బన్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త : బ్రిటీష్ పాలనపై అలుపెరుగని పోరాటం చేసి బానిస పాలన నుంచి స్వాతంత్ర్యానికి కారణమైన సమరయోధుల ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా పిలుపునిచ్చారు. ఆజాదీకి అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశ భక్తి చాటేలా నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మునిసిపాలిటీలో బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన నా దేశం, నా మట్టి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం నినాదంతో ప్రతి పల్లె, పట్టణాల్లోనూ సమరయోధుల స్ఫూర్తిని నింపడమే దీని ప్రధాన లక్ష్యమని తెలిపారు. అందులో భాగంగా ప్రతి వార్డులో 75 చెట్లు నాటడం, స్థానిక అమర వీరుల పేర్లతో శిలాఫలకాలు పెట్టడం, వారి కుటుంబాలను గౌరవించి, సత్కరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు ఆకాంక్షించినట్టుగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గాంధి కలలు కన్న స్వరాజ్యాన్ని, అంబేద్కర్ కోరుకున్న సమ సమాజాన్ని చేసి చూపిస్తూ వారికి నిజమైన వారసుడిగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిలిచారని ప్రశంసించారు. వైకాపా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో స్వయం పరిపాలన, ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీలకు అగ్రస్థానం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమం లో మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాశ్, డి.శంకర్, కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి పలువురు వైకాపా ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అర్బన్ మెప్మా మార్ట్ ప్రారంభం:**

మహిళలను అన్ని విధాలా ఆదుకుని వారికి ఆర్థిక భరోసా ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కృషి చేస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి రోజా న్నారు. మునిసిపాలిటీలో మహిళల కోసం ప్రత్యేకంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మెప్మా మార్ట్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణ మాఫీ చేస్తానని డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేస్తే, జగన్ మాత్రం నాలుగు విడతలుగా మాఫీ చేశారని తెలిపారు. డ్వాక్రా మహిళలకు షి బ్యాంక్ లింకేజీ కింద ఒకొక్క గ్రూప్‌నకు రూ. 20 లక్షలు రుణం ఇస్తున్నారని తెలిపారు. జగనన్న తోడు కింద గతంలో ఒకొక్కరికి రూ. 10 వేల రూపాయలు ఇవ్వగా, ఇపుడు రూ. 13 వేల రూపాయలు ఇస్తున్నారని తెలిపారు. అలాగే సిఎం నిధి కింద గతంలో పది వేలు, తర్వాత ఇరవై వేలు, ప్రస్తుతం రూ. 50 వేలు చొప్పున ఇస్తున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా వుండడమే కాకుండా వారి పిల్లల కోసం అమ్మఒడి, నాడు-నేడు, గోరు ముద్ద, విద్యా కానుక వంటి పథకాలు చేపడుతూ మహిళా పక్షపాతిగా జగన్ చరిత్రలో నిలిచిపోతున్నారని తెలిపారు.

## మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం : మంత్రి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

నగరి, ఆగస్టు 19 ప్రభాతవార్త: మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నట్లు మంత్రి రోజా అన్నారు. మున్సిపల్‌పరిధి సత్రవాడ, వినాయకపురంలో శనివారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు గజమాలలు, శాలువలతో హారతులు పట్టి ఆమెను ఆహ్వానించారు. మండల స్థాయి అధికారులతో కలసి ప్రతి గడపకు పర్యటించి ఆమె నాలుగేళ్ళలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని నివాసితులకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నానన్నారు. తన భర్త నేత సామాజిక వర్గానికి చెందిన వారే అని తాను ఆ సామాజిక వర్గపు ఆడపడుచునే అన్నారు. ఆప్కోకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వ యూనిఫాం తయారీని ముఖ్యమంత్రితో చర్చించి స్థానిక మరమగ్గ కార్మికులకు తీసివ్వడం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో ఆ ఆర్డర్లు ఎంతో మంది మరమగ్గ కార్మికులకు ఉపాధినిచ్చిందన్నారు. వివిధ సంక్షేమ పథకాలతోను మరమగ్గ కార్మికులను ఆదుకుంటున్నామన్నారు. టీడీపీ నేత చంద్రబాబుకు తనకు ఎంతో అనుభవం ఉందని గొప్పలు చెప్పుకోవడం తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బి.ఆర్.వి.అయ్యప్పన్, జిల్లా నేత అనుబంధశాఖ అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మెప్మా టీఎల్ఎం సునీత, కౌన్సిలర్లు వెన్నెల, మురుగ, ఎన్.సి.ఆనందకుమార్, పార్టీ నాయకులు జగన్, అయ్యప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# తొట్టంబేడు మండలంలో... మరో భారీ పరిశ్రమ

**-రూ.1,620కోట్లతో రైల్వేకోచ్‌ల అల్యూమినియం బాడీల తయారీ**



హిండాల్కో పరిశ్రమలో ఉత్పత్తుల దృశ్యం

తొట్టంబేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం పరిశ్రమల కేంద్రంగా మారనుంది. ఇప్పటికే తొట్టంబేడు మండలంలో కజారియా, గ్రీన్‌ప్యానల్ పరిశ్రమలు ఉండగా ప్రభుత్వం కొత్తగా మండలంలోని తాటిపర్తి గ్రామసమీపంలో రూ.1,620 కోట్లతో హిండెల్కో ఇండ్రస్ట్రీస్ తమ పరిశ్రమ ఉత్పత్తులను నెలకొల్పేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటికే తాటిపర్తి గ్రామ సమీపంలో కజారియా టైల్స్ పరిశ్రమ ఉండగా తాజాగా ఆదిత్య బిర్లా అనుబంధ విభాగమైన హిండెల్కో ఇండ్రస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ అండ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన సహకారం అందించాల్సిందిగా కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా తొలిదశలో రూ.1,620కోట్లు పెట్టుబడితో 165మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావ కాశాలు కల్పిస్తామని పేర్కొనగా ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. హిండాల్కో ఇండ్రస్ట్రీస్ లిమిటెడ్ ఒక భారతీయ అల్యూమినియం మరియు రాగి తయారీ సంస్థ, ఇది ఆదిత్య బిర్లా గ్రూప్‌కు అనుబంధ సంస్థ. దీని ప్రధాన కార్యాలయం మహారాష్ట్రలోని ముంబైలో ఉంది. ఈపరిశ్రమలో తాము ఏర్పాటు చేసే యూనిట్ రైల్వే కోచ్‌ల తయారీకి అవసరమైన అల్యూమినియం బాడీలను రూపొందిపస్తుందని తెలిపింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వందశాతం ఆటోమేటెడ్ యూనిట్‌ను దేశంలోనే తొలిసారిగా మండలం లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సిఫారసులతో తొలిదశ యూనిట్ కోసం 62.41 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మలిదశలో యూనిట్ కోసం మరో 51.81 ఎకరాలను కేటాయించగా మొత్తం 114.22ఎకరాలు కేటాయించేందుకు ప్రాథమికంగా అనుమతి జారీచేసింది. మలిదశలో సర్వేనంబర్ 127లో 3.84 ఎకరాలు, 128లో 7.12ఎకరాలు, 197లో 0.51ఎకరాలు, 199లో 5.87 ఎకరాలు, 200లో 7.39లో, 205లో 4.92 ఎకరాలు, 206లో 5.23 ఎకరాలు, 207లో 8.06 ఎకరాలు, 208లో 1.49 ఎకరాలు, 209లో 2.06ఎకరాలు, 210లో 5.32 ఎకరాలు మొత్తం కలిపి 51.81 ఎకరాలు కేటాయించారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి కలగనుంది. ఇప్పటికే కజారి యా, గ్రీన్ ప్యానల్ పరిశ్రమలో పలువురు ఉపాధి పొందుతున్నారు. ఈపరిశ్ర మతో పలువురు నిరుద్యోగయువతకు ఉపాధి కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా తొట్టంబేడు మండలంలో భారీ పరిశ్రమ రావడం సంతోషంగా ఉంది. పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే రౌతుసూరమాల సమీపంలో సుమారు 6వేల ఎకరాలు ఎపిఐఐసి సిద్ధం చేసింది.

# సంఘటనకు సజీవ సాక్ష్యం... ఛాయాచిత్రం

**టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి**



ఛాయా చిత్రకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు ప్రభాతవార్త : చరిత్రలో అనేక సంఘటనలకు సజీవ సాక్ష్యం ఛాయాచిత్రమని టిటిడి చైర్మన్, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ తిరుపతి జిల్లా శాఖ ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటో గ్రఫీ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి ఫోటో ఎగ్జిబిషన్ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో భూమన మాట్లాడుతూ నిరంతరం కష్టతరమైన వృత్తిలో అలుపెరగని కృషి చేస్తున్న ఫోటో జర్నలిస్టుల పనితీరు అభినందనీయమన్నారు. ఇటీవల వార్తా రచనలో, నిజాలు తగ్గినా.. ఫోటోలో నిజం కనిపించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఫోటోల ద్వారా తాను చాలా ప్రభావం చెందానని అన్నారు. తిరుపతిలో పని చేస్తున్నటువంటి ఫోటో జర్నలిస్టులు సుదీర్ఘమైన అనుభవం కలిగిన వారని దేశ వ్యాప్తంగా గుర్తింపు కలిగినటువంటి వారని అన్నారు. ఫోటో జర్నలిస్టుల ప్రతిభ మరింతగా జనబాహుళ్యంలోకి రావాలని అన్నారు. నూతన కమిటీ మరింతగా మెరుగ్గా పని చేయాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి సీనియర్ ఫోటో జర్నలిస్టులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ సభ్యులు ఎం గురుమూర్తి, నగర మేయర్ డాక్టర్ శిరీష, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. రాధాకృష్ణ, ఆర్. లావణ్య కుమార్, కోశాధికారి ఎం. శివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. గిరిబాబు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, సీనియర్ పాత్రికేయులు ఆర్ఎం ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య కారక వ్యర్థాల... నియంత్రణకి చర్యలు

**రూ.16.50కోట్లతో నిర్మించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీస్, ల్యాబరేటరీని ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి (క్రీడ), ఆగస్టు 19 ప్రభాతవార్త : తిరుపతిలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, ల్యాబరేటరీ భవనంను రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. శనివారం బాలాజీ కాలనీలో నిర్మించిన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ భవనమును, ల్యాబరేటరీను ప్రారంభించే కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఈ భవనానికి 25 సెంట్లు భూమిని రెవెన్యూ శాఖ ద్వారా నగరంలో కేటాయించబడి, 5పై అంతస్తులతో ఏపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ వారి పర్య వేక్షణలో మొత్తం రూ. 16.50 కోట్లతో 34 వేల చదరపు అడుగులలో నిర్మించిన ఈ సొంత భవనాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో జోనల్ కార్యాలయం తిరుపతిలో ఏర్పాటు చేసిన ఇదే భవనం సరిపోయేలా నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మార్పులు తీసుకుని వచ్చారని, మన ప్రభుత్వం వచ్చాక కాలుష్య కారక వ్యర్థాల నియంత్రణలో చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఎక్కడా కాలుష్యం లేకుండా కాలుష్య నియంత్రణ మండలి ద్వారా అనేక చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎక్కడా కాలుష్యం లేకుండా కాలుష్య నియంత్రణ మండలి ద్వారా అనేక చర్యలు చేపడుతోందని అన్నారు. తిరుపతి ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ రకాల కాలుష్యాన్ని నియంత్రించడమే ధ్యేయంగా ఈ సంస్థ పని చేస్తోందని, పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి జిల్లా ప్రజలు కాలుష్యం కోరల్లో చిక్కుకోకుండా ముందు చూపుతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, ప్రయోగశాల భవనం ప్రారంభిస్తునందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సభా ముఖంగా తిరుపతి ఎంపి గురమూర్తి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు మరకా శివకృష్ణారెడ్డి, పాకా సురేష్, డాక్టర్ సునీల్ కుమార్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ కెవి రావు సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, ఆర్ఓ కడప అశోక్ కుమార్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ రోశయ్య, ఈఈ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి నరేంద్ర బాబు, మధన్మోహన్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సుస్థిర జీవనోపాధి కల్పనే లక్ష్యం

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త :

మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందని వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఐబిడిపిఎం మాధవి పిలుపు నిచ్చారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో వైయస్ఆర్ క్రాంతి పథం సారధ్యంలో మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా అధికారి మాధవి ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా మహిళలు చిన్న సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య ఏర్పాటు చేసుకొని పొదుపు చేసుకుంటూ చిన్న చిన్న అప్పులు సక్రమంగా తిరిగి చెల్లించటం వల్ల ఈ రోజు గ్రామ సంఘాలు ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంక్ లోన్స్‌తో పాటు



ప్రభుత్వం అందించే నవరత్నాలు ఉపయోగించుకొని సుస్థిర జీవనోపాధులు కల్పనే లక్ష్యంగా ప్రతి మహిళ ఎదగాలని తెలిపారు. యంపిపి సంపూర్ణమ్మ చెంగల్‌రాయులు మాట్లాడుతు జగనన్న మహిళలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్నామని మరో సారి జగనన్నను అందరూ దీవించాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ కెవి. దినేష్‌రెడ్డి సమాఖ్య లీడర్లుగా నూతన కార్యవర్గాన్ని ఎఉన్ను కున్నారు అధ్యక్షురాలు టి. వాణి, (తొండమనాడు), కార్యదర్శిగా వి. విజయ(చల్లపాళెం )కోశాదికారిగా పి. ప్రియ (ఓబులాయిపల్లి)ఉపాధ్యక్షురాలుగా యస్. శ్రీలేఖ(చుక్కల నిడిగల్లు), సహాయకార్యదర్శిగా కె. సుబ్బమ్మ(వాగవీడు)లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమాల్లో స్త్రీనిధి మేనేజర్ వనజ, లీగల్ కో ఆర్డినేటర్ గరటారెడ్డి, సిసిలు మాధవయ్య, గంగులయ్య, మురళి సిఆర్‌పి మాధవి అన్ని సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## విజేత పాఠశాలలో రెడ్ కలర్‌డే

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త :



పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉనన విజేత ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాలలో రెడ్ కలర్‌డేను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఎరుపు రంగులో ఉన్న పండ్లు, కూరగాయలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ కాయం సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించం వల్ల చిన్నారులకు రంగులపై అవగాహన మరియు ఏవస్తువు ఏరంగులో ఉంటుందో అనేది తెలుసుకోవడం సులభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాసింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటింటికి మహిళా మహాశక్తి ప్రచారం:

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్), ఆగస్టు 19 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ రూపొందించిన మహిళా మహాశక్తి మేనిఫెస్టోను తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసారు. మండలంలోని ఆమందూరు పంచాయతిలో ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేస్తున్నారు. శనివారంనాయకులు మహాశక్తి ద్వారా ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణి చేసారు. మహాశక్తి పథకంలో 18-59 సంవత్సరాల వరకు ప్రతి మహిళకు రూ.1500 లు నెలకు ఇచ్చే పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. ఇంటిలో ప్రతి బిడ్డకు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించే విధంగా రూపొందించామన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి మండల మహిళా అధ్యక్షులు హంస మండల యువత అధ్యక్షులుగుణ యాదవ్, పార్లమెంటు బిసి ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం మండల బిసి అధ్యక్షులు మునెయ్య, ప్రభాకర్, సుబ్రమణ్యం రెడ్డి కెవి రమణ, బొమ్మినేటి రమణయ్య, ధశరధయ్య సుధాకర్, నిరంజన్ మహిళా నాయకులు రేణుకాదేవి, సుమతి, మల్లీశ్వరి తులసి, చంద్రమ్మ, శ్రీలక్ష్మిల సారధ్యంలో ఇంటింటికి తెలుగుదేశం మహిళలు పాల్గొన్నారు.

## కాళికాపురం సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన సెల్వి

విజయపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త:



మండలంలోని కాళికాపురం సర్పంచ్‌గా సెల్వి ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో శనివారం గ్రామ సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. జీఎం పురం 4వ వార్డు సభ్యురాలిగా మీన, మాధవరంలో 5వ వార్డు సభ్యురాలిగా హంస, మల్లారెడ్డి కండ్రిగలో 4వ వార్డు సభ్యురాలిగా గౌరి ఆయా సచివాలయ కేంద్రాల్లో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డఈ బాబు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు పాండ్యన్, శ్రీరాములురెడ్డి, శరత్, హరీష్, శివమణి, రవి తదితరులు పాల్గొన్నారు.

## భద్రత నిమిత్తమే వివరాల సేకరణ



**నగరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి విద్యా దీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి నగరి పట్టణానికి విచ్చేస్తున్నందున భద్రతలో భాగంగానే రోడ్‌షో జరగనున్న మార్గంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని సీఐ సురేష్ తెలిపారు. రోడ్‌షోలో భాగంగా దుకాణాలు మూసి వేయాలంటూ తప్పుడు ప్రచారాలు ఊపందుకున్న నేపథ్యంలో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టత ఇచ్చారు. అలాగే పట్టణ పరిధిలో ఎవరైనా నూతన వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## గణనాధుని సన్నిధిలో ఎమ్మెల్యే బాబు

కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:



పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్. బాబు శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ. మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ కెఎస్. శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, నాయకులు చిన్నారెడ్డి, ఎంపీపీ చింతం మోహన్, మండల వైకాపా కనీ ్వనర్ బుజ్జిరెడ్డి. పుణ్యసముద్రం రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 2024 ఎన్నిలకు నాంది కాణిపాకం ఉపఎన్నిక : ఎమ్మెల్యే

కాణిపాకం ఆగస్టు 19 ప్రభాతవార్త:

2024 ఎన్నిలకు నాంది కాణిపాకం ఉపఎన్నిక అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు అన్నారు. 5వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైకాపా మద్దతుదారు మౌనిక విజయం సాధించిన అనంతరం ఎమ్మెల్యే ఆమెను అభినందించారు. సమావేశంలో కాణిపాకం ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, ఎంపీపీ మోహన్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అర్ధగిరి సన్నిధిలో జడ్పీ ఛైర్మన్


తవణంపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామివారిని జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి శనివారం దర్శంచున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా జడ్పీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## రేపటి నుంచి కళ్యాణ వీరభద్రుని వార్షిక బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త



మండలకేంద్రంలోని నారాయణ వనం మేజర్ పంచాయతీ పరిధి (చిత్రాంగికోట) సముదాయం గ్రామానికి వెళ్ళే మార్గంలోని వీధిలో వెలసిన భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు 21వ తేది నుంచి జరగుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. ప్రతిరోజు ఉత్సవం సమయంలో 9.30గంటల నుంచి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం జరుగుతుందన్నారు.

## దేశం సుభిక్షం కోసం.... 22నుండి కారీరిష్టి ,వరుణ యాగం



తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్తప్రతినిధి:

దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని... సకాలంలో మంచి వర్షాలు కురవాలని కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమలేశుని ప్రార్థిస్తూ ఈనెల 22వతేదీ మంగళవారం నుండి 26 వతేదీ శనివారం వరకు కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలు టిటిడి నిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈనెల 26న మహాపూర్ణాహుతి జరగనుంది. ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిల్ కెఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## విద్యార్థుల నృత్య ప్రదర్శన

-శ్రీసిటీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విద్యార్థుల సందడి

సత్యవేడు, ఆగష్టు18, ప్రభాతవార్త:



శ్రీసిటీ-శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆద్వర్యంలో శనివారం శ్రీసిటీ పరిధిలోని ఆరూరు నర్సరీ ప్రాంగణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వివిధ కార్యక్రమాలు రసరమ్యంగా కొనసాగింది. తొలుత విద్యార్థులచేత గోవింద నామ స్మరణ పఠనం చేయిం చారు. ఇరుగుళం, మాదనపాళెం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈకార్య క్రమంలో భాగస్వాములు అయ్యారు. కొందరు విద్యార్థినులు అన్నమయ్య కీర్తనలు, ఇతర జానపద పాటలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం సమీపంలోని శ్రీసిటీ ఉద్యానవనాన్ని సందర్శించారు. ఈకార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యానవన అధికారి మధురెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్ర కుమార్, పల్లేటి బాలాజీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి అర్‌టిసి డిపోలో చోరులు!

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపోలో దొంగలు విచ్చల విడిగా వ్యవహరిస్తున్నారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తికి తమిళనాడు, కర్నాటకలనుంచే కాకుండా చుట్టపక్కల గ్రామాల నుంచి ప్రయాణీకులు అధిక సంఖ్యల హాజరౌతున్నారు. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా రూరల్ బస్టాండుగా వివిధ ప్రాంతాలకు నడిచే బస్సుల పయనించే బస్సుల్లో ప్రయాణించే వారి నుంచి దొంగలు విచ్చల విడిగా పల్లెవెలుగు బస్సులు నాయుడుపేట, సూళూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం మార్గాల్లో బస్సులు నడుస్తుంటాయి. అయితే ఇక్కడ దొంగలు తిష్టవేసారు. దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ప్రయాణీకుల పర్సులు, సెల్ ఫోన్లు తస్కరిస్తున్నారు. ఇక్కడ ఆర్‌టిసి అధికారులు ప్రత్యేక నిఘాతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి ప్రయాణీకుల భద్రతపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇక్కడ పోలీసుల నిఘా ఉన్నా, ఆర్‌టిసి సెక్యూరిటి ఉన్నా విచ్చల విడిగా దొంగతనాలు సాగుతున్నాయంటే దొంగల ప్రతిభ తెలుస్తుంది.

## 23న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు స్వామి అమ్మవార్లకు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈ నెల 23న లెక్కింపుకు మూహూర్తం ఖరారు చేసినట్లు ఇఓ కెవి సాగర్‌బాబు శనివారం తెలిపారు. స్వామి అమ్మవార్ల ఆలయాల వద్ద హుండీలను ఏర్పాటు చేసారు. వాటిని ఈ నెల 23న లెక్కించనున్నారు. ఇందుకు రెగ్యూలర్ సిబ్బంది డ్రెస్ కోడ్‌ను అమలు చేస్తూ హాజరు కావాలని సూచించారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద లెక్కింపు చేపట్టనున్నట్లు వివరించారు.

## శానిటరీ ఇన్సెపెక్టర్ మృతికి సంతాపం

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుమారు 30సంవత్సరాలుగా శానిటరీ ఇన్సెపెక్టర్‌గా సేవలందించిన రఘునాధ్‌రెడ్డి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో చనిపోవటంతో ఆయన మృతికి శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంతాప సభను నిర్వహించారు. పరిపాలనా భవనాలలో సంతాప సభను ఏర్పాటు చేసారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు. డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, ఎఇఓ సతీష్ మాలిక, సూపరింటెండెంట్లు, నాగభూషణం యాదవ్, శ్రీహరి, కళ్యాణి, పిఆర్‌ఓలు వెంకటస్వామి, నాగభూషణం నాయక్, టెంపుల్ సిబ్బంది, హోంగార్డులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొని తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## అక్కగార్ల, మునీశ్వర ఆలయంలో కుంభాభిషేకం

- హాజరైన తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, ఆగష్టు19 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ వేదాంతపురంలో కొలువుదీరిన అక్కగార్లు, మునీశ్వర ఆలయంలో కుంభాభిషేకం శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ కుంభాభిషేకంలో తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు చేసారు. అంతకమనుపు మోహిత్‌రెడ్డికి వేదాంతపురం గ్రామ సర్పంచ్ తోట చిరంజీవిరెడ్డి పూర్ణకుంభ స్వాగతం కలికారు. గోమాతకు గో పూజ చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగరాజులరెడ్డి, రవిరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెనికలకు డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు ప్రధానం

తిరుపతి (విద్య), ఆగష్టు 19 ప్రభాతవార్త



శ్రీ పద్మావతి నర్సింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సి. వెనికలకు డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డును అందుకున్నారు. ప్రొఫెసర్ ఎన్ రజని ఆధ్వర్యంలో ఇంపాక్ట్ స్టాటజిక్, ఎయిడ్స్ ఎడ్యుకేషనల్ ఇంటర్వెన్షన్ అఫ్ నాలెడ్జ్ ఆటిట్యూడ్ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ నర్సస్ అనే అంశం పై తాను సమర్పించిన పత్రానికి అవార్డును ప్రధానం చేసారన్నారు.

## బ్యాకింగ్, పారిశ్రామిక అవకాశాలపై ఉపన్యాసం

తిరుపతి (విద్య), ఆగష్టు 19 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ సహకారంతో బ్యాంకింగ్, హెల్త్‌కేర్, పారిశ్రామిక అవకాశాల కోసం ఏఐ డ్రైవన్ ఇన్నోవేషన్ అనే అంశం పై ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులను శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఐఐసి వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి స్వాగతించారు. ఈ సందర్భంగా డిఎస్‌టి క్యూరీ ఎఐ సెంటర్ అండ్ ఐఐసి యొక్క కార్యచరణపై వైస్ చాన్సలర్ ప్రొ. భారతి ప్రస్తుత పరిస్థితుల్లో ఏఐ పాత్ర గురించి వివరించారు. అనంతరం ప్రధాన వక్త డాక్టర్ సచిన్ కుమార్ అగర్వాల్, ఏఐ సిఓఈ సెంటర్, పెప్సికో డైరెక్టర్, బ్యాంకింగ్, హెల్త్ కేర్ రంగంలో వర్చువల్ రియాలిటీ, ఏఐ యొక్క ప్రాముఖ్యత పై బ్యాంకింగ్ రంగం, మెటావర్స్‌లో ఏఐని ఉత్పత్తి చేయడం పై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ అంబాసిడర్ డా.ఎం శివ పార్వతి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వివిధ విభాగాలకు చెందిన 150 మంది విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరు ఎర్రదొంగలు అరెస్ట్...కారు సహా 8 దుంగలు సీజ్

చంద్రగిరి, ఆగష్టు 19 ప్రభాతవార్త:



చంద్రగిరి మండల పరిధిలోని శ్రీవారిమెట్టు మార్గంలో ఇద్దరు ఎర్రచందనం దొంగలను అరెస్ట్ చేసినట్లు సిఐ రాజశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీవారిమెట్టు మార్గంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కారును ఆపి తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇందులో 8 ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న తమిళ నాడుకు చెందిన శివకుమార్, కడపకు చెందిన మహేంద్ర ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కారుతో సహా ఎర్రచందనం దుంగలను సీజ్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరునిందితులు శక్తివేలు, సుధాకర్ పరారైనట్లు తెలిపారు. ఎర్రచందనం దుంగలను తమిళనాడులోని అంతర్జాతీయ స్మగ్లర్ సత్యరాజ్ గోడౌన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పరారైన నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు.

## వేపగుంట వార్డు ఎన్నికల్లో టిడిపి విజయం

పుత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త :



రూరల్ మండలంలోని వేపగుంగ పంచాయతీ మూడో వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి ఎ. భారతి విజయం సాధించారు. 41 ఓట్ల తేడాతో విజయం సాధించడం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయానికి నాంది అని టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గెలుపొందిన అభ్యర్థి భారతిని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ గజమాలతో సత్కరించారు. అలాగే పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్యలు విజయం సాధించిన అభ్యర్థికి ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రవికుమార్, మాజీ అధ్యక్షుడు కరుణ యాదవ్, తడుకు సర్పంచ్ వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి కవిత, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శేఖర్‌నాయుడు, ఐటిడిపి సభ్యుడు గాలి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ కార్ దగ్ధం

తిరుచానూరు, ఆగష్టు 19 ప్రభాతవార్త :



నాయుడుపేట -పూతలపట్టు జాతీయ రహదారి తనపల్లి క్రాస్ ఓటేరు వద్ద శనివారం హుండాయ్ క్రెటా కారు దగ్ధమైన సంఘటన జరిగింది. తిరుచానూరు వర్షా విశ్వనాథ్ నగర్‌కు చెందిన యశ్వంత్ తన ఇంటి వద్ద నుండి స్నేహితులను కలుసుకుందుకు తిరుపతి వెళ్లే క్రమంలో ఓటేరు వద్దకు వచ్చేసరికి ఒక్క సారిగా బ్యానట్లో నుండి మంటలు ఎగిసిపడటంతో కారు దిగి పక్కకు వచ్చేసానని తర్వాత కారు పూర్తిగా కాలిపోయిందని, దాని విలువ 16 లక్షలు, 2021 మాడల్ పెట్రోల్ కారు అని యజమాని యశ్వంత్ తెలిపారు.

## కమనీయం కళ్యాణ వేంకటేశ్వరుని ఊంజల్‌సేవ


నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, అర్చకులు పాల్గొన్నారు.

## నేటి సొరకాయులస్వామి మహాగురుపూజోత్సవాలు

నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణ వనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి వారి 121వ మహా గురు పూజోత్సవాలకు ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 20నుంచి30వ తేది వరకు ఉత్సవాలు జరుగుతుంది. 21వ తేది సోమవారం మహాగురుపూజ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఆలయానికి వెల్లకొడుతున్నారు. మంగళవారం ఉదయం 8గంటలకు ధ్వజారోహణం జరగనుంది.

# 3కోట్ల రూపాయల చీటీలసొమ్ముతో వ్యక్తి పరార్..



పెద్దపంజాణి ఆగష్టు19 ప్రభాతవార్త : తమ ఇళ్ళలో జరిగే శుభకార్యాలకు ఎంతోకొంత మిగులు పెట్టుకుందామని,తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ఆశగా చీటీలకు డబ్బులుకడుతూ తమసొమ్ము చీటీల నిర్వాహకుడి వద్ద భద్రంగా ఉంటుందని భావించిన ప్రజలకు చీటీల నిర్వాహ కుడు శటగోపం పెట్టాడు దాదాపు 3కోట్ల రూపాయల చీటీల సొమ్ముతో ఆ వ్యక్తి పరారయ్యిన సంఘటన మండలంలో వెలుగు చూసింది.దీంతో భాదితులు లబోదిబోమంటూ న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రించారు.ఈ సంఘటనకు సంబందించి బాధితుల కథనం మేరకు వివరాలిలా..పెద్దపంజాణి మండలంలోని శివాడి గ్రామానికి చెందిన చెంగ్రాయప్ప కుమారుడు లోకేష్‌బాబు మండలంలోని శంకర్రాయలపేటలో గతంలో చిన్న టీ

## -లబోదిబో అంటున్న బాధితులు - పోలీసులను ఆశ్రయించిన వైనం.

దుకాణం నిర్వహించేవాడు.ఇతనికి ప్రజలతో మంచి పరిచయాలు ఏర్పడిన నేపథ్యంలో చీటీలను ప్రారంబించాడు.ఈ క్రమంలో లోకేష్‌బాబు స్థాయి పెరిగడంతో జనరల్‌స్టోర్,సిమెంటు ఏజన్సీ,షామియాన సప్లయర్స్ నిర్వహించేవాడు. తనవద్ద చీటీలు ఎత్తిన వారినుంచి సైతం ఎక్కువ మెత్తంలో వడ్డీ చెల్లిస్తానని మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకునేవాడన్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు చీటీలసోమ్ము, తమవద్ద అప్పుగా తీసుకున్న సొమ్ము చెల్లించాలని లోకేష్‌బాబును అడిగిన నేపథ్యంలో అతను వారిని కొంతకాలం గడువు కావాలని కోరుతూ మభ్యపెడుతూ వచ్చేవాడని తెలిసింది.ఒక్కసారిగా లోకేష్‌బాబు ఎవరికీ తెలియకుండా గ్రామంలో దిఖానా ఎత్తేశాడు.అతని గురించి భాదితులు వాకబుచేసినా ఎలాంటిసమాచారం అందకపోవడంతో భాదితులు పోలీసులకు ఫిర్యాదు చేసారు.తాముఎంతో కష్టపడి సంపాదించిన సొమ్మును చీటీలకు లోకేష్‌బాబు చేతుల్లో పెట్టామని అతను తమను ఇలానిలువునా మోసంచేస్తాడని అనుకోలేదని పోలీసు అధికారులు స్పందించి తమకు తగు న్యాయం చేయాలని భాదితులు కోరారు.మండలంలో ఈ సంఘటన చర్యనియాంశంగా మారింది.



### అందంగా తీర్చిదిద్దే పనులు షురూ!

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: కలియుగవైకుంఠం తిరుమలలో మరో నెలరోజుల్లో ఆరంభంకానున్న ఏడుకొండలవాడి బ్రహ్మోత్స వాలకు కొండ ముస్తాబవుతోంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో కలియుగవైకుంఠవాసుడు ఏడుకొండల వేంకటేశ్వరునికి రెండు బ్రహ్మోత్స వాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్స వాలను టిటిడి అధికారులు విజయవంతం చేయడం, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే దిశగా పనులు మొదలుపెట్టింది. ఇప్పటికే స్వామివారి పుష్కరిణి మూసివేసి అభివృద్ధి పనులు చేపడుతోంది. ఇంకా ఆలయ మాఢవీధుల్లో, ఆలయుం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దడం, బారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు,షెడ్ల నిర్మాణం వంటి పనులు చేసేలా టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి అన్ని విభాగాలను ఉత్తేజపరిచి పర్యవేక్షిస్తున్నారు. సెప్టెంబర్ 18వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్స వాలు 23వతేదీతో ముగుస్తాయి. బ్రహ్మోత్స వాలకు తొలిఘట్టంగా ధ్వజారోహణం జరిగే సెప్టెం బర్ 18వతేదీనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిం చనున్నారు. ఈ తొమ్మిదిరోజుల ఉత్స వాల్లో 22వతేదీ గరుడసేవ, 23న బంగారురథం, 25న రథో త్స వం, 26న చక్రస్నానమహోత్స వం,ధ్వజావరోహణం ప్రధాన ఘట్టాలు. కాగా నవరాత్రి బ్రహ్మోత్స వాలు అక్టోబర్ 15వతేదీ నుండి మొదలుకానున్నాయి. ఈ బ్రహ్మోత్స వాల్లో ప్రధానంగా 19వతేదీ గరుడ వాహనం,20న పుష్పపల్లకి,22న స్వర్ణరథోత్స వం, 23న చక్రస్నానమహోత్స వంతో ముగియను న్నాయి.

## కరుణాకర్‌రెడ్డిని సత్కరించిన శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త :** దళిత గోవిందం లాంటి విన్నూత్న ప్రణాళికలతో గోవిందుని



సామాన్యుల దరి చేర్చిన కృషి వలుదు టిటిడి చైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి అని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. శనివారం ధర్మకర్తల మండలి సభ్యులు టిటిడి చైర్మెన్‌ను సత్కరించారు. వేదపండితులతో శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలను అందించారు. ఆశీర్వదించారు.ఆయనతోపాటు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ అభినయరెడ్డిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు.గోవిందుని సామాన్యుల చెంతకు చేర్చటానికి మరిన్ని పథకాలు రూపొందించాలని కోరారు.పాదనడకన తిరుమలేశుని చేరుకునే భక్తులకు అగ్రతాంబూలం అందించాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో అంజూరు తారక శ్రీనివాసులుతోపాటు పాలకమండలి సభ్యులు మున్నారాయల్, రమాప్రభ, సుమతి,పార్టీకి చెందిన నీలా,కొండూరు నంద, భాస్కర్‌ముదిరాజ్, రవి, రమణయ్యనాయుడు, గోపిగౌడ్ వెంకటసుబ్బయ్య, లక్ష్మీపతి, బాలాగౌడ్, సుధీర్, సాయి, సునీల్, వేదపండితులు శ్రీవాస్తవ్ శర్మ, ఆంజనేయులు అవధాని, మహేశ్ శర్మ, వంశీ శర్మ, దేవస్థానంకు చెందిన సుదర్శనం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోలా ఆనంద్‌ను సత్కరించిన పార్టీ నాయకులు


శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త :



రాష్ట్ర బిజెపి కార్యదర్శిగా నియమితులైన మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్‌ను శనివారం స్థానిక బిజెపి నాయకులు సత్కరించారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు సారధ్యంలో సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్న నరేంద్రమోదీ నాయకత్వంలో బిజెపి విజయపథంలో నడుస్తుందన్నారు. రాష్ట్రంలో బిజెపి జెండాను ఎగుర వేయటానికి కేంద్ర నాయకత్వం గ్రామీణ స్థాయి నుంచి కృషి చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కోసం పాటు పడేవారికి పార్టీ బాధ్యతలు అందిస్తున్నారని వివరించారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్‌ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ కోఆర్డినేటర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి,జిల్లా కార్యవర్గసభ్యుడు కొండేటి గోపాల్, ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, డిల్లికుమార్, సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు లింగా బత్తిన గోపాల్, మన్న సముద్రం చెంగల్‌రాయరెడ్డి, సజ్జాహరిష్, సీనియర్ నాయకులు ఇమిటిశెట్టి మోహన్‌రావు, అమర్‌నాథ్, శ్రీపురం సుధాకర్, కలపాటి మోహన్‌రావు,పగడాలప్రతాప్,భరత్,చందురాయల్,వెంకటరాయులు,రవి,రాజా తదితరులు పాల్గొన్నారు.

## పులి వాహనంపై శ్రీద్రౌపదీదేవి

పుత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్స వాల సందర్భంగా(తిరుణాళ్ళ) శనివారం శ్రీ ద్రౌపదీదేవి శ్రీ ధర్మరాజుల స్వామి పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం మంచినీళ్ళగుంట వద్ద నుంచి మంగళ వాయిద్యాల నడుమ గెరిగె ఆలయానికి చేరుకుంది. ఆ కలశంలోని జలాన్ని అమ్మవారికి అభిషేకం చేశారు. అలాగే స్వామివారిని అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం తీర్థోత్స వం పాండవ కౌరవ జననం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న తిరుపతికి చెందిన ఎస్.సుమతి భాగవతారినిచే మహాభారత హరికథ కార్యక్రమంకు పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి వైభవంగా మేళాతాళాల నడుమ స్వామివారిని అమ్మవారిని పులి వాహనంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా పుత్తూరు వణిజ సంఘం(గాండ్ల) వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్, పాలక మండలి సభ్యులు ముకుంద, ప్రకాష్, సెల్వరాజుపిళ్లై, మునిరాజ, లక్ష్మిసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ అర్చకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

న నేడు ఆలయంలో శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్స వాల సందర్భంగా ఉదయం 8 గంటలకు ఉత్స వం మధ్యాహ్నం పాండవ కౌరవ కుమారుల విద్యాభ్యాసం నిరుపేద విద్యార్థులకు సంచి, పలక, బలపం, స్టీల్ తట్ట, గ్లాసు, ఉచితంగా అందించే కార్యక్రమం, రాత్రి 8 గంటలకు ఉత్స వం అనంతరం యాలి వాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ

## తిరుచ్చిపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న

చంద్రగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. విశేష అలంకరణ గావించి బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాధ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు ఆంజనేయాచార్యులు, అధ్యాపక సంతానకృష్ణన్, పరిచారిక విష్ణు స్వామి, జమేధార్ జలంధర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా మినీ వాటర్ ట్యాంకును ప్రారంభం

నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మండలంలోని తిరువట్యం దళితవాడలో క్రిస్టియన్ మిషన్ వారిచే సుమారు 3.60 లక్షల రూపాయాలతో నిర్మించి మినీ ప్లాస్టిక్ వాటర్ ట్యాంకును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నీటి కష్టాలను గుర్తించి సుమారు 3.60 లక్షలను అందించిన క్రిస్టియన్ మిషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాన్ని శుభ్రంగా వుంచుకోవడంతో కలిసి మెలిసి వుండాలన్నారు. జగనన్న సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటు న్నట్టు గుర్తు చేశారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి వాటర్‌ట్యాంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, ఊరప్ప, ఆర్‌డి ఏకాంబర , అన్నాదొరై, సర్ప ంచ్ నాగూరు, ఎంపిడిఓ గుణశేఖర్, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్‌రాజు, స్థానిక నాయకులు తిరువేంగడం, రజిని, శివ, చీరాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో కంప్లిక్ట్ మేనేజ్‌మెంట్‌పై వర్క్‌షాపు

రేణిగుంట, ఆగస్టు 19 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సీఐఐ, కాంప్లిక్ట్ మేనేజ్‌మెంట్‌పై వర్క్ షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చైర్‌పర్స న్, ఐడబ్ల్యుఎన్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, అమర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవిగౌరినేని మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో సంఘర్షణ ఉంటుందన్నారు. సంఘర్షణను సరిగా మలుచుకోగలిగితే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. అమరరాజ, వర్ష ఫుడ్స్, మండలంలోని వివిధ కళాశాలలకు చెందిన పలువురు వర్క్‌షాపుకు హాజరయ్యారు. శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామసుబ్బారెడ్డి, కళాశాల కార్యదర్శి అరవిందకుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ జయచంద్రన్, కళాశాల ప్రిన్సిపల్, బోధన బోధనేతర సిబ్బంది అన్నారు.

## ఏనుగుల ఆర్చివద్ద మరో 'చిరుత'

-సిసి కెమెరాల ట్రాఫ్‌లో కదలికలు

తిరుమల,ఆగస్టు 19 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల నుండి తిరుపతికి దిగే మొదటి ఘాట్‌లో ఏనుగుల ఆర్చివద్ద శుక్రవారం రాత్రి ఓ చిరుతపులి



సంచరించినట్లు ట్రాఫ్ సిసికెమెరాలో కనుగొన్నారు. కాలినడక మార్గాల్లో భయపెట్టిన చిరుతలు మూడింటిని పట్టి బంధించగా తాజాగా ఘాట్ సమీపంలో మరోచిరుత కదలికలను గమనించారు.దీంతో మొదటిఘాట్‌లో చిరుతను పట్టివేయడానికి బోనులు ఏర్పాటు చేశారు.కాలినడక మార్గాలు, ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం భక్తులను భయాందోళనకు గురిచేస్తోంది. ఇటీవల ఆరేళ్ళ లక్షితపై కాలినడక మార్గంలో మెట్లపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో దాడిచేసి తలను పీక్కుతిని దారుణంగా చంపిన ఘటన విదితమే.ఈ ఘటనతో టిటిడి,పోలీసు,అటవీశాఖ అధికారులు ఆపరేషన్ చిరుత మొదలుపెట్టారు. వాటి కదలికలను గమనిస్తూ పదివరకు బోనులు ఏర్పాటుచేసి చిరుతలను బంధించే ప్రక్రియ జరుగుతోంది. తిరుమలలో కాలినడక మార్గాల్లో చిరుతలు, ఎలుగుబంట్లు కదలికలపై టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, అటవీశాఖ అధికారి శ్రీనివాసులు స్వయంగా భక్తుల భద్రతపై సమీక్షిస్తున్నారు.

### కొండంతా ముస్తాబు!

## బెస్ట్ ఫ్రెండ్స్ సేవలు అభినందనీయం : ఆర్డీఓ

గూడూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త :



గూడూరు పట్టణంలోని బెస్ట్‌ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాతృమూర్తి పుట్టిన రోజు సందర్భంగా గూడూరు ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు, రోగులకు, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ప్రభుత్వాసుపత్రిలో బాలింతల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రభుత్వాసుపత్రిలోని రక్తదాన కేంద్రంలో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసి యేషన్ సభ్యులు, గూడూరు ఆర్డీఓ రక్తదానం చేశారు. అనంతరం గూడూరు పట్టణంలోని సాయిరాం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా దగ్గరుండి అందరికీ భోజనం వడ్డించారు. హరిప్రియ దంత వైద్యశాల వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చెమిర్తి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, మేకనూరు సర్పంచ్ రమేష్ పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కోటయ్య యాదవ్, శ్రీపతి రత్నయ్య, డాక్టర్లు బ్రహ్మయ్య, గౌరీశంకర్, హరిప్రియ, హాస్పిటల్ సిబ్బంది, సెక్రటరి కోటి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన నీరు, గాలిని కాపాడుకోవాలి: ఎమ్మెల్యే

నాయుడుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త :



స్వచ్ఛమైన నీరు, గాలిని కాపాడుకొని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. దేశం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలు అర్పించారని, వారందరినీ స్మరించుకోవాల్సి న అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శనివారం నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన నా భూమి నాదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవయ్య పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నుంచి కలశాలలో సేకరించిన మట్టి, నీటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భూమి మన దేశాన్ని కాపాడుకోవాల్సి న బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ క్రమంలోనే దేశ ప్రధాని నరేంద్రమోడీ నా భూమి నాదేశం అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. స్వచ్ఛమైన నీరు, గాలిని కాపాడుకొని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఎంపిపి ధనలక్ష్మి, మున్సి పల్ చైర్‌పర్స న్ కటకం దీపిక, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఆరు మండలాల ఎంపిపిలు, ఎంపిడిఓలు, నాయకులు పాదర్తి హరినాథరెడ్డి, కటకం జయరామయ్య, జెసిఎస్ కన్వీనర్లు ఒట్లూరు కిషోర్‌యాదవ్, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచి జరిగింది కాబట్టే వైకాపా గెలుపు

-సిఎం జగన్‌ను ప్రజలు నమ్ముతున్నారు : భరత్

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు మంచి జరిగింది కాబట్టే వైకాపాకు వార్డు ఎన్నికల్లో ప్రజలు మద్దతు పలికారని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో గతకొంతకాలంగా తెదేపా నేతల దౌర్జన్యాలు, దాష్టీకాలు ప్రజలు గమనించారన్నారు. తాము ఓడితే ఊర్లు వదులుతామని, సైకిల్ యాత్రలు చేస్తున్నా, ప్రజల కాళ్లు పట్టుకున్నా తెదేపా నేతలను ప్రజలు తిరస్కరించారన్నారు. భగవంతుడు వార్డు ఎన్నికల రూపంలో పరీక్ష పెట్టాడని 6 వార్డులకు గాను 5 వార్డుల్లో వైకాపా మద్దతుదారులు గెలిచినట్లు పేర్కొన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు మేలు జరిగి ఉంటేనే ఓటు వేయాలని తాము కోరామన్నారు. వైకాపా అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు, కార్యకర్తలు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మున్సి పల్ చైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి చైర్మన్ విద్యాసాగర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ పత్రాల మునిరత్నం, నేతలు సిపి మనోహర్, తీర్థగిరి పాల్గొన్నారు.

**చంద్రబాబు ఇల్లు కట్టే పంచాయతీలోను ఓడారు : ఎఎంసి చైర్మన్ విద్యాసాగర్**

శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీలో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు సొంత ఇల్లు కడుతున్నా అక్కడ వార్డు ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిందని ఎఎంసి చైర్మన్ విద్యాసాగర్ పేర్కొన్నారు. 2024లో కుప్పం నుంచి గెలిచి ఎమ్మెల్సీ భరత్ మంత్రి అవుతారన్నారు.

## మహిళలకు అండగా నిలిచేది చంద్రబాబే

– తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ

శాంతిపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని మహిళలకు అండగా నిలిచేది తెదేపా అధినేత చంద్రబాబునాయుడేనని నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ పేర్కొన్నారు. శనివారం మండలంలోని 64 పెద్దూరులో మహాశక్తి పథకాల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. తెదేపా అధికారంలో వస్తే తల్లికివందనం పేరిట ప్రతి పిల్లవాడికి ఏటా 15వేలు, 18-50 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రెండు వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి మహిళకు పసుపు,కుంకుమ, వస్త్రాలు అందించి చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తామన్నారు. రాష్ట్రంలో వైకాపా పాలనలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు మహిళలకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మహిళా నేతలు సుగుణమ్మ, పుష్ప, శకుంతల, పొలారాణి, గ ంట్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు తమ్ముళ్ళకు పులివర్తి సుధారెడ్డి పరామర్శ

చంద్రగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:



మండల పరిధిలోని మల్లయ్యపల్లి, మండపం పల్లిలకు చెందిన తెలుగుతమ్ముళ్ళను శనివారం టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ మల్లయ్యపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు మహేష్ గత కొద్ది రోజులుగా కాలిగాయంతో బాధపడుతూ శస్త్రచికిత్స లు చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇక్కడికి చేరుకున్న ఆమె మహేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అధైర్యపడవద్దని, టిడిపి మీకు అండగా వుంటుందన్నారు. మహేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మండపం పల్లికి చెందిన గురవారెడ్డి, బాలకృష్ణ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో భాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారి నివాసాలకు చేరుకుని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపకఅధ్యక్షుడుసక్కుర్‌ధనంజయ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, తదితరులు వున్నారు.

## వైభవంగా అన్నమయ్య పద నృత్యార్చన

తిరుచానూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త :




తిరుపతి మహతి ఆడిటోరియంలో శనివారం అన్నమయ్య పద నృత్యార్చన ఫ్రైడ్ అండ్ కల్చరల్, సిటిజన్ వెల్ఫేర్ ఫోరమ్ కోలా వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో అన్నమయ్య పద నృత్యార్చన వైభవంగా జరిగింది. వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన పలువురు 15 నృత్య బృందం వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులు అన్నమయ్య పాటలతో నృత్యము అందరినీ ఆకట్టుకున్నారు. తిరుచానూరుకు చెందిన శివశంభవి డాన్స్ అకాడమీ వారు శశికళ విజయ్ బృందం వారికి, పలువురు కళాకారులను, గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాళహస్తి చైర్ పర్స న్ శ్రీనివాసుల, దేవస్థానం బోర్డు సభ్యులు గోపి, సుబ్బరాయులు, నెల్లూరు మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పనులు వేగవంతంకు తగు చర్యలు తీసుకోవాలి:కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 19 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో నిర్వహిస్తున్న పనులను వేగవంతం చేసే పనులను పూర్తి చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సూచించారు. శనివారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో కమిషనర్ హరిత సమక్షంలో నిర్వహించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొని అధికారులకు ముఖ్య అంశాలను సూచించారు. అనంతరం కమిషనర్ హరిత మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్రీ లెఫ్టులు వలన చాలా ఉపయోగకరంగ వున్నాయని, మరిన్ని ప్రాంతాల్లో కూడా ఫ్రీ లెఫ్టుల ఏర్పాటుకు ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులు సమన్వయంగా పని చేయాలని తెలిపారు. సుందరీకరణలో భాగంగా కొన్ని ముఖ్య కూడల్లలో పచ్చదనం



పెంపు, ఆహ్లాదం, విజ్ఞానం పెంచే విగ్రహాల స్థాపన చేసే విషయంలో అధికారులు పరిశీలించాలన్నారు. ఇటీవల ప్రారంభించిన మ్యూజిక్ కళాశాల ఐలాండ్ వద్ద ఏర్పాటు చేసిన సంగీత వాయిద్య నమూన పరికరాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని అదే విధంగా ఎంఆర్‌పల్లి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ దండి మార్చ్ విగ్రహాలు ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని తీసుకువచ్చిన విషయాలను కమిషనర్‌కు వివరించారు. డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న ప్రతి ఒక్క అభివృద్ధి పనికి అధికారులు, సిబ్బంది కృషి మరువలేనివని, అనుకున్న మేర పూర్తి చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్టుల పనులను వేగవంతంగా పూర్తి కావడానికి అధికారులు సమన్వయంతో పని చేయడమే కారణమన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ సిటి ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ దేవానంద్, డిఈలు, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.